క్లుప్తంగా

ఐక్యతతో సంఘం బలోపేతం



తొగటవీర క్షత్రియ సంఘం కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: ఐక్యతతో తొగటవీర క్షత్రియ సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం చౌడేశ్వరి కల్యాణ మంటపంలో సంఘం సమావేశం నిర్వహించారు. తొగట వీర క్షత్రియ సంఘం జిల్లా కమిటీ ఎంపికలో భాగంగా సోమందేపల్లికు చెందిన బండారు శ్రీనివాసులును జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శిగా రిషిశ్వర్, సభ్యులుగా జగదీష్, మారుతి, గోవిందు, రాజేషలను ఎన్నుకున్నారు. స్థానికంగా చేనేత కార్మికుల కోసం సంఘం అధ్యక్షుడు సీసీ హరి చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శేషాద్రి, నాయకులు పుల్లయ్య, శంకర్, యుగంధర్, గోపాల్, అమర్, అశోక్, రమేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నంది విగ్రహం వద్ద యోగా తరగతులు

లేపాక్షి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి యోగా శిక్షణ తరగతులను సోమవారం నుంచి ప్రసిద్ధి చెందిన లేపాక్షి నంది విగ్రహం వద్ద ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతుండేవని, అయితే చారిత్రక ప్రదేశంలో నిర్వహించాలనే ఉద్దేశంతో నంది విగ్రహం దగ్గర నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే వారు రోజూ ఉదయం 6.30 గంటలకు హాజరుకావాలన్నారు.

క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు రండి



వీర జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్న కోడూరు యువకులు

చిలమత్తూరు: ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశ సరిహద్దులో పాక్ సైనికులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన వీరజవాన్ మురళీ నాయక్ స్మారకంగా కోడూరులో యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. సోమవారం నిర్వహించబోయే ఫైనల్ మ్యాచ్‌కు ప్రేక్షకులు పెద్ద ఎత్తున రావాలని కోడూరు యూత్ మురళీ నాయక్ తల్లిదండ్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు ఆదివారం వారు కల్లితండాకు వెళ్లి మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫైనల్స్‌కు మురళీనాయక్ తల్లిదండ్రులు తప్పక వస్తామని హామీ ఇచ్చినట్లు నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, అశోక్, నరేష్, రామచంద్ర తెలిపారు.

రేపు శనీశ్వరస్వామి జయంత్యుత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో కొలువు తీరిన శాంత స్వరూపుడు శనీశ్వరస్వామి జయంత్యుత్సవ వేడుకలు ఈ నెల 27న వైశాఖ బహుళ అమావాస్య రోజున ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా జయంత్యుత్సవాలు వైశాఖ బహుళ త్రయోదశి సందర్భంగా ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామి వారికి మహా గణపతి పూజ, స్వస్తివాచన, నాంది, సప్తమాతృకా పూజ తదితర పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం దేవతారాధన, దీక్షాహోమం, విష్ణు సహస్ర నామార్చన తదితర పూజలు చేశారు.

భగవద్గీత ప్రచారం

హిందూపురం: ప్రబోధానంద స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాల ప్రచార ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఆదివారం రైల్వేస్టేషన్ గాయత్రీ ఆలయం వద్ద ప్రబోధ సమితి సభ్యులు చేపట్టింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పుస్తకాల అందించి భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. మార్గశిర మాసం శ్రీకృష్ణుడికి ప్రీతికారమైనది, భగవద్గీత పఠనంతో మోక్షమార్గం లభిస్తుందన్నారు. శ్రీకృష్ణుడిని ఆరాధించి శరణుకోరితే ఆయన అనుగ్రహంతో మోక్షానికి చేరుకోగలమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ముద్దిరెడ్డిపల్లి కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ, సభ్యులు మునీంద్ర, శేఖర్, కిష్టప్ప, సుభద్ర, కోనమ్మ, లీలా, సుబ్బమ్మ, పుష్పా, కళ తదితరులు పాల్గొన్నారు.

గాలి వీస్తే కరెంట్ కట్ !

చిన్నపాటి గాలి వీచినా, చినుకు పడినా హిందూపురం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. మళ్లీ ఎప్పుడు వస్తుందో తెలీని పరిస్థితి ఉంటోంది. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్రకటిత కోతలు కూడా పెరిగిపోయాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


- చిన్నపాటి గాలికి సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం
- 'పురం'లో పెరిగిన అప్రకటిత కోతలు
- తీవ్ర ఇబ్బందుల్లో వినియోగదారులు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

హిందూపురం ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఇలా...

విద్యుత్ కనెక్షన్లు : **1.86** లక్షలు

కమర్షియల్ కనెక్షన్లు : **5** వేలకు పైగానే..

ఏడాదికి వినియోగదారులు చెల్లిస్తున్న విద్యుత్ బిల్లు : రూ.**180** కోట్లకు పైగానే..



హిందూపురం టౌన్: పట్టణంలో విద్యుత్ సరఫరా మెరుగుకు చర్యలు తీసుకుంటామని అధికారులు గొప్పలు చెప్పడమే తప్ప ఆచరణలో అమలు కావడం లేదు. ముందస్తు చర్యలు లేకపోవడంతో విద్యుత్ సమస్యలు వినియోగదారులను వెంటాడుతున్నాయి. విద్యుత్ బిల్లుల రూపంలో రూ.కోట్లను చెల్లిస్తున్నా కరెంటును సక్రమంగా ఇవ్వకపోవడమేంటని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికమవుతున్న అప్రకటిత కోతలు

విద్యుత్ అధికారులు నెలలో రెండు కనీసం సార్లైనా పలు ప్రాంతాల్లో మెయింటెన్స్ పేరుతో విద్యుత్‌ను నిలిపేస్తున్నారు. దీంతో పాటు గాలి, వాన ఉన్నప్పుడు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. ఈ మధ్య కాలంలో అప్రకటిత కోతలు అధికమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. వేసవి కావడంతో బయట అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వడగాల్పులు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఇంట్లో ఉన్న ఫ్యాన్ లేదా ఏసీనే కాస్తా ఉపశమనం కలిగిస్తోంది. అయితే మధ్యాహ్నం వేళల్లోనూ అధికారులు విద్యుత్ కోతలు విధిస్తుండడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అప్రకటిత కోతలు ఆపాలని కోరుతున్నారు.

రాత్రి వేళ సమస్య అధికం..



విద్యుత్ అంతరాయంతో అంధకారంలో అంబేద్కర్ సర్కిల్

పట్టణంలో ఇటీవల వర్షం కురిసిన ప్రతి సారి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి గాలికే విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్‌ను నిలిపేస్తున్నారు. రాత్రి సమయాల్లో వర్షం పడినప్పుడు సమస్య మరింత ఇబ్బందికరంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు. గతం వారంలో సాయంత్రం వేళల్లో వర్షం కురవడంతో గంటన్నరకుపైగా విద్యుత్‌ను తొలగించారు. అలాగే రాత్రి సమయాల్లో వర్షం కురడంతో అర్ధరాత్రి సేవలకు అంతరాయం కలిగింది. ఈ తరుణంలో ఉక్కపోతతో ప్రజలు రాత్రిళ్లు జాగరణ చేయాల్సి వచ్చింది. అలాగే గత నెలలో వర్షం కారణంగా పట్టణమంతా సుమారు 4 నుంచి 5 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

అంధకారంతో తప్పని అవస్థలు

హిందూపురం పట్టణంలో అనేక చోట్ల విద్యుత్ తీగలు బలహీనపడ్డాయి. వాటి స్థానంలో కొత్త తీగల ఏర్పాటు కలగానే మారింది. ఈ కారణంగా తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అసలే వేసవి.. అందులోనూ విద్యుత్ పోయినప్పుడు రాత్రి వేళల్లో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి వీస్తే కరెంటు అంతరాయం కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ముద్దిరెడ్డిపల్లి, మేళాపురం, రహమత్‌పురం, ఆర్టీసీ కాలనీ, ముక్కడిపేట, ఆబాద్‌పేట, హస్నాబాద్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంబాలకు ప్రైవేటు వైర్లు వేలాడుతుండడం, అనేక వీధుల్లో విద్యుత్ తీగలు ఇళ్లకు ఉండే సర్వీసు తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతుండడంతో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తుయి. ఈ తరుణంలో పలు చోట్ల విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయి. అలాగే దండు రోడ్డు ప్రాంతంలోనే పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయని, వాటి ద్వారా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.

విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి



ఇటీవల విద్యుత్ కోతలు అధికమయ్యాయి. చిన్నపాటి గాలి వీస్తేనే విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో ఇంటిలో ఉక్కపోతతో అల్లాడుతున్నాము. విద్యుత్ లేకపోతే ఇంట్లో ఉండలేని పరిస్థితి. అలా అని బయట ఉన్న ఉష్ణోగ్రతలకు బయటకు రాలేని పరిస్థితి. విద్యుత్ కోతలను నియంత్రించాలి.

– భాస్కర్, హిందూపురం

వర్షం పడినప్పుడు కోతలు సహజం

గాలి, వాన రావడం వల్ల విద్యుత్ కోతలను సహజంగానే విధిస్తాము. ఇలా ఎక్కువగా వర్ష కాలంలో ఎక్కువగా జరుగుతుంటుంది. ఇటీవల గాలి, వానలు పడడంతోనే విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలరాయి. అయినప్పటికీ త్వరితగతిన విద్యుత్‌ను పునరుద్ధరించాం. ఏదైనా మేజర్ సమస్య వచ్చినప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నాము.

– భూపతి, ఈఈ, హిందూపురం డివిజన్

ఉష్ణోగ్రత సమాచారం



హిందూపురం	32.0
పెనుకొండ	35.0
మడకశిర	32.0


క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప

పావగడ: గ్రామీణ స్థాయి క్రీడా పోటీలకు అధికంగా ఆర్థిక సాయం అందించి గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప ప్రభుత్వానికి విన్నవించారు. తాలూకాలోని దేవలకెరెలో కేటీ హళ్లి గ్రామ పంచాయతీ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. పీడీఓ మంజునాథ్, కార్యదర్శి పరమేశ్వర్, వీఎస్ఎస్ఎన్ డైరెక్టర్ పాళేగార్ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందాల హరివిల్లు



చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఆకాశంలో హరివిల్లు దర్శనమిచ్చింది. రంగు రంగుల హరివిల్లును స్థానికులు ఆసక్తిగా గమనించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షెక్షావలి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించుకోవాలన్నారు. అలాగే మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

అగళిలో తాగునీటికి కట కట



వాటర్‌ప్లాంట్ వద్ద నీటి కోసం వేచిచూస్తున్న ప్రజలు

అగళి: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. రొళ్లలో ఏర్పాటు చేసిన మెగా మదర్ ప్లాంట్ నుంచి ఫ్లోరైడ్ రహిత నీటిని ట్రాక్టర్ల సహాయంతో ట్యాంకర్ల ద్వారా నీటని సరఫరా చేస్తూ వచ్చారు. అయితే అగళిలో ఉన్న మెగా మదర్ ప్లాంటు నిరుపయోగంగా మారడంతో నీరు సరిగా సరఫరా కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి మాత్రమే నీటిని అందించేవారని, అయితే ఆదివారం మండల కేంద్రానికి కూడా నీరు సరఫరా చేయకపోవడంతో తాగు నీటి కోసం వాటర్ ప్లాంట్ వద్ద స్థానికులు పడిగాపులు కాశారు.

పార్టీలో అన్ని వర్గాల వారికీ సముచిత స్థానం



లేపాక్షి మండల నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అంటే పేదల పార్టీ అని, పార్టీలో అన్ని వర్గాలకు చెందిన వారికీ సముచిత గౌరవం దక్కేలా చూస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి అన్నారు. ఆదివారం హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో లేపాక్షి మండల నాయకులతో వివిధ అంశాలపై చర్చించారు. వేణురెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలే ప్రథమ ప్రాధాన్యంగా చూస్తున్నామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సర్కార్‌కు బుద్ధి చెప్పేలా ప్రజలు తీర్పునిస్తారని, ఆ దిశగా ప్రతి గ్రామ పంచాయతీలోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రణాళికతో కూటమి వైఫల్యాలను ప్రజల ముందుంచేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేయాలని, ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లేపాక్షి మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బషీర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి సీనియర్ నేతలు చలపతి, మాధవరెడ్డి, బోర్ల అంజనరెడ్డి, మంజు, చంద్రశేఖర్‌రెడ్డి, మధు, రామాంజినేయులు, రవి, నాయనపల్లి తిప్పన్న, రామాంజి, రామకృష్ణారెడ్డి, నరసింహప్ప, చంద్ర, శ్రీనివాసరెడ్డి, షమీవుల్లా, శివారెడ్డి, రుద్రప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహమూర్తి, కల్లూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను గుర్తించండి



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ: విద్య ప్రాధాన్యతను వాల్మీకి కుల విద్యార్థులు గుర్తించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మిట్టాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాల్మీకులు అనాదిగా విద్యకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని, అయితే విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విషయాన్ని మరవకూడదన్నారు. పేదరిక నిర్మూలనతో పాటు ఆయా కుటుంబాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలంటే విద్య ముఖ్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వాల్మీకి కుటుంబాలకు చెందిన ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చక్కగా చదివించి వారిని ఉన్నత ఆశయంతో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇందుకోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు విజయకుమార్, శివయ్య, జగదీష్, ఈశ్వరయ్య, ముత్యాలప్ప, శివన్న, కామప్ప తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పూజలు



అమరాపురం: అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి మూల ప్రతిమకు గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకించారు. తర్వాత వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కల్లూరు సుబ్బారావుకు ఘన నివాళి



కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, హిందూపురం మాజీ శాసన సభ్యులు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు 128వ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్‌నిస్సార్, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రామాంజినేయులు, శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు పట్టణంలోని ఇందిరాపార్కులో ఉన్న కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజినేయులు, తిప్పన్న, రామాంజినేయులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కల్లూరు సుబ్బారావుకు నివాళులర్పించారు. కల్లూరు సుబ్బారావు రాయలసీమ రాజకీయ పితామహుడుగా పేరుగాంచారన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన చేసిన సేవలను గుర్తించి హిందూపురం నడిబొడ్డున విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అధికారికంగా ఆయన జయంతి, వర్ధంతిని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కల్లూరు సుబ్బారావు మనవళ్లు ఆదినారాయణరావు, కవి రచయిత కల్లూరు రాఘవేంద్రరావు, ఉమల్ ఫారూక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

• మహాలక్ష్మీ నమోస్తుతే !



ఆలయం వద్ద నాట్య కళాకారుల నృత్య ప్రదర్శన (ఇన్‌సెట్) అలంకరణలో మహాలక్ష్మీ



పరిగి: మండలంలోని పురాతన గౌరవనహళ్లి మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఢిల్లీ ఆంధ్రభవన్ ఉద్యోగి సౌజన్య నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గౌరవనహళ్లిలోని పురాతన మహాలక్ష్మీ (లక్కమ్మ) ఆలయంలో బ్రహ్మ సూత్ర శివలింగ కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని కొఠారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు బసవరాజుచే రుద్రాభిషేకం చేపట్టారు. శోభాయాత్రను చేపట్టిన అనంతరం ఆలయ ప్రాంగణంలో గోపూజ, కల్పతరు (మొక్కలు నాటే కార్యక్రమాన్ని) నిర్వహించారు. అక్కడి నుంచి ఆలయంలోకి ప్రవేశం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. నిర్వాహకులు లక్ష్మీనారాయణ, మహేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో ట్రా'ఫికర్'



రొద్దం: ట్రాఫిక్ సమస్యతో నిలిచిన ఆర్టీసీ బస్సు

రొద్దం: మండల కేంద్రంలోని రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. నిత్యం రద్దీగా ఉండే పావగడ–పెనుకొండ ప్రధాన రహదారిపై తోపుడు బండ్లు, దుకాణదారులు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికి తోడుతు ద్విచక్ర వాహనాలు ఎక్కడపడే అక్కడ రోడ్డుపై నిలిపేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 108, అంబులెన్సులు వెళ్లేందుకు కూడా ఆలస్యమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

ఉర్దూ టీచర్ మృతి

హిందూపురం: మండల పరిధిలోని ధరంపురంలో నివాసమున్న ఎంపీయూపీ ఉర్దూ స్కూల్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న జరీస్ తాజ్ (58) ఆదివారం మృతి చెందినట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. ఆమె మేళాపురంలోని స్కూల్ పనిచేస్తూ కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోందన్నారు. బెంగళూరులో చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చిన కాసేపటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

నేడు యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

పెనుకొండ: వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న పెనుకొండ పట్టణంలో సోమవారం యూనియన్ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని ప్రజలు, వ్యాపారులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. దర్గా సర్కిల్‌లోని మండి వ్యాపార కేంద్రం వెనుక ఉన్న భవనంలో బ్యాంక్‌ను ప్రారంభిస్తున్నామన్నారు.

నేడు మురళీనాయక్ సంస్మరణ సభ

పరిగి: మండలంలోని సేవామందిరంలో వీరజవాన్ మురళీనాయక్ సంస్మరణ సభను సోమవారం నిర్వహిస్తున్నట్లు గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు రామలింగప్ప ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఏఎం లింగణ్ణ విద్యా సంస్థల ప్రాంగణంలో మధుర గానలహరితో పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.